# హుళా హుళి

- ఎమ్మెస్వీ గంగరాజు

ప్రమోషన్ మీద భువనేశ్వర్ ట్రాన్స్ఫర్ అవ్వడం- ప్రమోషన్ వచ్చిన సంతోషాన్ని కాస్తా డైల్యూట్ చేసేసింది. ట్రాన్స్ఫర్ ఆర్డరు కేన్సిల్ చేయించుకోవడానికి ప్రయత్నించాను కానీ కుదరలేదు. ప్రమోషన్ మీద వేసిన ఆర్డరు కనుక వెళ్లి తీరాలన్నారు. ఇక చేసేదేమీ లేక బయలుదేరడానికి నిశ్చయించుకున్నాను. మా ఆవిడ దిగులుపడిపోయింది. తనని ఓదార్చి, ఇల్లు చూశాక వచ్చి తీసుకెళ్తానని చెప్పి రైలెక్కాను.

కొత్త ప్రదేశం, తెలియని భాష, కొత్త బాధ్యతలూ- ఎలా నెట్టుకు రాగలనోననే దిగులు పీడిస్తూనే వుంది. అయితే, ఆఫీసులో సగం మంది తెలుగువాళ్లే ఉండడం, మిగిలిన ఒరియా వాళ్లు కూడా సరదాగా కలసిమెలసి మెసలడం చూశాక వచ్చిన నాల్రోజుల్లోనే నాలోని దిగులు పూర్తిగా పోయింది. సిటీ వాతావరణం కూడా ఎంతో ఆహ్లాదకరంగా తోచింది. అద్దె ఇల్లు కుదిరేదాకా ఒక బ్యాచిలర్ ఆఫీసర్ ఇంట్లో చేరాను. ఆఫీసు పని అయ్యాక సాయంకాలాలు ఇళ్ల వేటలో పడేవాణ్ణి. రెండు వారాలపాటు తిరగ్గా తిరగ్గా అన్ని సదుపాయాలూ వున్న ఇల్లొకటి దొరికింది.

అడ్వాన్సెస్ సెక్షన్‌లో నాతోపాటు రమాకాంత్ పాణిగ్రాహి అనే ఒరియా ఆఫీసర్ ఒకతను ఉండేవాడు. అతడితో కొద్ది రోజులలోనే బాగా చనువేర్పడింది. కొన్ని ఒరియా పదాలు అతని దగ్గర నేర్చుకుని మిగతా కొలీగ్స్ దగ్గర ప్రయోగించేవాణ్ణి. రెండు రోజుల్లో హైదరాబాద్ బయలుదేరి మా ఆవిణ్ణీ, పిల్లడినీ తెచ్చుకోవడానికి ఏర్పాట్లు చేసుకున్నాను.

ఆ రోజు సెలవు దినం. పనిమనిషి చేత ఉదయం ఇల్లు కడిగిస్తుండగా పాణిగ్రాహి వచ్చాడు. వాళ్లింట్లో ఏదో పూజ జరుగుతోందని ఆ రోజు లంచ్‌కి రమ్మని పిలిచాడు. అతడికి ఢిల్లీ బదిలీ అవుతోందనే గాలివార్త ఆ ముందు రోజే వచ్చింది. కొంత అప్సెట్ అయ్యాడు ఆ వార్త విని. 'పది గంటలకి వచ్చి పికప్ చేసుకుంటాను, రెడీగా ఉండ'మని చెప్పి వెళ్లిపోయాడు.

అంత క్రితం ఇద్దరు, ముగ్గురు ఒరియా ఆఫీసరిళ్లలో భోజనం చెయ్యడం జరిగింది. ఉప్పుడు బియ్యం అన్నం, భోజనంలో పెరుగు లేకపోవడం- ఈ రెండు లోపాలు తప్ప భోజన పదార్థాలు బాగానే ఉండేవి. వాళ్ల పిల్లల్ని చూస్తుంటే ఎంతో ముచ్చటగా ఉండేది. ఇంటికి వచ్చిన అతిథుల్ని రెండు చేతులూ జోడించి నమస్కారం పెడుతూ ఆహ్వానించేవారు. మన పిల్లల్లో అంతటి వినమ్రత చూసి ఎరుగను.

చెప్పిన టైంకే పాణిగ్రాహి వచ్చాడు. ఇద్దరం కలసి అతని స్కూటర్ మీదనే ఓల్డ్ టౌనులో వున్న అతనింటికి బయలుదేరాం. దారిలో లింగరాజ్ మందిరం. 'మౌసిమా' మందిరం చూపించాడు. భువనేశ్వరంలో ప్రాచీన దేవాలయాలు చాలా ఉన్నాయి. అందుకే కాబోలు, భువనేశ్వరాన్ని 'సిటీ ఆఫ్ టెంపుల్స్' అంటారు.

ఇల్లు చేరగానే అతని కొడుకూ, కూతురూ నమస్కారం పెడుతూ ఎదురయ్యారు. అరగంటలో పూజ పూర్తవుతుందనీ, అందాకా పిల్లల్తో మాట్లాడుతుండమని చెప్పి అతను లోపలకెళ్లాడు. పిల్లలు చెప్తే తెలిసింది ఆ రోజు సావిత్రి అమావాస్య పూజట! ఆ రోజు ఆడవాళ్లు సతీ సావిత్రికి ముందు పూజ చేసి, తర్వాత భర్త పాదాలకు పూజ చేస్తారుట.

పిల్లలతో మాట్లాడుతుండగా, లోపల గదిలోంచి 'ఉళు... ఉళు... ఉళు...' అని విచిత్రమైన కేకలు వినిపించాయి. ఆ కేకలు వినబడగానే నా పక్కనే కూర్చున్న పిల్లలిద్దరూ హడావిడిగా లోపలకు పరుగెత్తారు. మళ్లీ మళ్లీ అవే కేకలు వినిపించాయి. ఆ గదిలో నేను ఒంటరిగా మిగిలిపోయాను. పదేపదే ఆ కేకలు వినిపిస్తూండడంతో నాలో ఆందోళన మొదలైంది. అప్పుడు సడెన్‌గా గుర్తొచ్చాయి. అంత క్రితం పాణిగ్రాహి అన్న మాటలు- 'ఢిల్లీ ట్రాన్స్ఫర్ వలన నాకేమీ పెద్దగా ఇబ్బంది లేదు గాని మా



అమ్మాయితోనే ప్రాబ్లమ్!'

సందేహం లేదు! అవి పిచ్చిపట్టిన పిల్ల వేసే కేకలే!! అమావాస్యకీ, పౌర్ణమికీ పిచ్చివాళ్లకి పిచ్చి ఎక్కువ అవుతుందంటారు. ఆ రోజు అమావాస్య కాబట్టి పిల్లకి పిచ్చి ఎక్కువైనట్టుంది. రూంలో చెయిన్‌తో కట్టి ఉంచినట్టున్నారు. 'ఉళు... ఉళు... ఉళు...' కేకలు వినిపిస్తూనే ఉన్నాయి.

'పాపం... పాణిగ్రాహి!' అనుకున్నాను.

కొంతసేపటికి కేకలు వినిపించడం మానేశాయి. పిచ్చిపిల్లకేదో సెడేటివ్ ఇచ్చినట్టున్నారు. ఆ పరిస్థితిలో అతనికి గెస్ట్‌గా వచ్చినందుకు కాస్త ఇబ్బంది కలిగింది.

తర్వాత, అతను వచ్చి నన్ను డైనింగ్ హాల్లోకి తీసుకుని వెళ్లాడు. హాలుకి ఆనుకుని చిన్న గదొకటి వుంది. దానికి తాళం వేసి వుంది. బహుశా ఆ గదిలోనే పిచ్చిపిల్లని ఉంచి ఉంటారనుకుని ఆ గదినీ, పాణిగ్రాహినీ ఒకసారి జాలిగా చూశాను. రకరకాల స్వీట్స్ చేశారు. దంపతులిద్దరూ ఆప్యాయంగా కొసరి కొసరి అన్ని వంటకాలూ వడ్డించారు. మా ఆవిడ వచ్చాక తప్పకుండా

రమ్మని ఆవిడతో చెప్పి ఇంటికి బయలుదేరాను భోజనాలవ్వగానే. హైదరాబాద్ హెడ్ ఆఫీసులో తన ట్రాన్స్‌ఫర్ విషయం కనుక్కోమన్నాడు పాణిగ్రాహి. కనుక్కోవడం కాదు ఆర్డరు కేన్సిల్ చేయించడానికి ప్రయత్నం కూడా చేస్తానన్నాను- పిచ్చిపిల్లతో అతడు పడుతున్న ఇబ్బందులు తలచుకుంటూ.

❖ ❖ ❖

వారం రోజుల్లో మా ఆవిణ్ణి తీసుకొచ్చేశాను. వచ్చిన కొద్ది రోజులలోనే తను కూడా అక్కడి వాతావరణానికి అలవాటు పడిపోయింది. ఆ ప్రాంతంలో తెలుగు కుటుంబాలు బాగానే ఉన్నాయి. సెలవు దినాల్లో స్నేహితుల ఇళ్లకు వెళ్తూ ఉండేవాళ్లం. పాణిగ్రాహి ఢిల్లీ ఆర్డరు కేన్సిలైంది. అతనింటికి వెళ్దామనుకుంటూనే, పిచ్చిపిల్ల గుర్తుకొచ్చి వెళ్లడానికి సాహసించలేక పోయేవాణ్ణి.

ఒకరోజు పూనాలో వున్న మా అన్నయ్య దగ్గర నుండి ఫోనొచ్చింది. తను పూనా ఎ.ఎఫ్.యం.సీ.లో సైక్రియాట్రీ ప్రొఫెసర్! కటక్ మెడికల్ కాలేజీ పీ.జీ. ప్రాక్టికల్స్‌కి ఎక్స్‌టర్నల్‌గా వస్తున్నట్టు చెప్పాడు. పాణిగ్రాహి ఇంట్లో పిచ్చిపిల్ల వెంటనే గుర్తొచ్చింది. విషయం అంతా చెప్పి రెండు రోజులు అదనంగా సెలవు పెట్టుకుని రమ్మన్నాను. ఆ పిచ్చిపిల్లని పరీక్ష చేస్తాడని నా తహతహ!

అన్నయ్య వచ్చాక ఆ మర్నాడు ఉదయం కటక్ బయలుదేరాం. మన జంటనగరాల్లా కాకపోయినా కటక్-భువనేశ్వర్ జంటనగరాల్లాంటివే! మెడికల్ కాలేజీకెళ్లే ముందు ఆ కాలేజీ సైక్రియాట్రీ ప్రొఫెసర్, డాక్టర్ 'కర్' ఇంటికి వెళ్లాం. ఉదయం తొమ్మిది అవుతుండగా అతడిల్లు చేరుకున్నాం. మమ్మల్నిద్దర్నీ కర్ సాదరంగా ఆహ్వానించాడు. నన్ను పరిచయం చేశాడు అన్నయ్య. కర్ దంపతులిద్దరూ డాక్టర్లే! కిందంతస్తు హాస్పిటల్‌గా ఉంచుకుని పై అంతస్తులో వాళ్లుంటారు. అతని భార్య మాత్రం కనిపించలేదు అంతవరకూ. అన్నయ్యా, అతడూ పరీక్ష విషయాలు చర్చించుకుంటూ కూర్చున్నారు. నేను బల్ల మీదున్న మాగజైన్లు తిరగేస్తూ కూర్చున్నాను.

ఇంతలో నాకు గగుర్పాటు కలిగించే కేకలు ఒక్కసారిగా లోపల నుండి వినిపించాయి. అవే ధ్వనులు! 'ఉళు... ఉళు... ఉళు...'మంటూ ఊళలు!! సందేహం లేదు. అవి పిచ్చివాళ్లు వేసే వికృతమైన కేకలు! కర్ దంపతులు ఎలాగూ పిచ్చి డాక్టర్లు (అదే, పిచ్చి కుదిర్చే డాక్టర్లు!)- కనుక లోపల ఎవరో పిచ్చి పేషెంట్ వేసే ఊళలే అవి! బహుశా కర్ భార్య లోపల పేషెంట్‌ని చూస్తున్నట్టుంది.

మళ్లీ మళ్లీ ఆ కేకలు వినిపించడంతో డాక్టర్ కర్ వైపు తిరిగి, 'డాక్టరు గారూ, ఆ శబ్దాలు ఏమిటి?' అని సౌమ్యంగా అడిగాను ఆతృత అణచుకోలేక.

'మార్గశిర గురువారం కదా! మా ఆవిడ లోపల పూజ చేసుకుంటోంది' అన్నాడతడు మామూలు ధోరణిలో. నేను నిర్ఘాంతపోయాను!

'ఏ అష్టోత్తరమో చదువుకోవాలి గానీ ఈ ఊళలేమిటి?' అని మనసులో అనుకుని, 'పూజకీ, ఆ శబ్దాలకీ సంబంధమేమిటి?' అని అడిగాను.

డాక్టర్ కర్ చిన్నగా నవ్వాడు.

'ఆ శబ్దాలని 'హులా హులి' అంటాం మేం. ఏ వ్రతం జరిగినా, శుభకార్యం జరుపుకున్నా మా ఆడవాళ్లు 'హులాహులిలు' వేస్తారు. చిన్నగా నోరు తెరిచి, నాలుకను అటూ ఇటూ ఆడిస్తే ఆ శబ్దాలొస్తాయి. వాళ్లకి మాత్రమే అవి సాధ్యం. వాటి పుట్టుపూర్వోత్తరాలైతే తెలియదు గానీ అవి మా పూజా విధానంలో ఒక భాగమైపోయాయి. మామూలుగా కర్పూర నీరాజనం ఇచ్చేటప్పుడు గంటలు వాయించుతారుగా! ఇవీ అలాగే ననుకుంటా' అంటున్న డాక్టర్ కర్‌ని సంభ్రమాశ్చర్యాలతో చూస్తూ ఉండిపోయాను. 'పిచ్చిపిల్ల' అపోహ ఆనాటితో తీరిపోయింది. కుందనపు బొమ్మలాంటి పాణిగ్రాహి కూతుర్ని పిచ్చిపిల్లగా ఊహించుకోవడం ఎంత పొరబాటో గ్రహించాను.

భువనేశ్వర్‌లో పనిచేస్తున్న రోజులు గుర్తొచ్చినప్పుడల్లా 'హులాహులిలు' గుర్తుచేసుకుంటుంటాను. వారి పూజా విధానాన్ని పిచ్చి కేకలనుకోవడం- మన ఊహలు ఒక్కోసారి ఎంత తప్పుగా ఉంటాయో గ్రహించడానికి చక్కని ఉదాహరణ! ●